

తమకు కేటాయించిన డబుల్‌బెడ్రూం ఇండ్లను ఇవ్వాలని పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రామగుండం మండల లబ్ధిదారులు

# డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఎప్పుడిస్తరు..?

**వెంటనే ఇవ్వాలని పలు ప్రాంతాల్లో లబ్ధిదారుల ధర్నా**

హైదరాబాద్ సిటీబ్యూరో/భువనగిరి కలెక్టరేట్/పెద్దపల్లిటౌన్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): డబుల్ బెడ్‌రూం ఇండ్లు పంపిణీ చేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రేటర్ నలుమూలల నుంచి లబ్ధిదారులు భారీగా తరలివచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం దాదాపు 66వేల మందికి పైగా లబ్ధిదారులకు ఇండ్లు పంపిణీ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా ఆ ఇండ్ల సముదాయాల్లో తాగునీరు, కరెంటు, రోడ్డు సదుపాయాలు కల్పించలేదని లబ్ధిదారులు మండిపడ్డారు. ఏర్పడుతున్నదని పేర్కొన్నారు. భువనగిరి పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించాలని లబ్ధిదారులు సోమవారం ఉదయం తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించారు. పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట రామగుండం మండల లబ్ధిదారులు ధర్నా చేశారు. వెంటనే ఇండ్లు పంపిణీ చేయాలని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.



హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రేటర్ పరిధిలోని లబ్ధిదారులు




## రాణాలోనే ఓయూ విద్యార్థినేత దీక్ష

**డిమాండ్ల సాధనకు నిరుద్యోగులతో కలిసి దీక్షకు యత్నం.. అరెస్ట్**

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 24: నిరుద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యోగ జేఏసీ చైర్మన్, ఓయూ జేఏసీ నాయకుడు మోతీలాల్‌నాయక్ దీక్షకు దిగారు. ముందుగా నిరుద్యోగులు ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిరాహార దీక్షకు కూర్చునేందుకు ప్రయత్నించగా, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మోతీలాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. గ్రూప్ 1 మెయిన్ పరీక్షకు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. మోతీలాల్‌నాయక్‌కు బక్క జడ్సన్, విద్యార్థి సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.



## ఒక్క ఉపాధ్యాయుడితో చదువులెట్లా..?

**ఓబులోనిపల్లి పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన**

ధరూరు, జూన్ 24: పాఠశాలలో ఒక్క ఉపాధ్యాయుడితో పిల్లల చదువులెలా సాగుతాయని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ఓబులోనిపల్లిలో పాఠశాల ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. డ్యూటీకి టీచర్ హాజరైనా పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తంచేశారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో 128 మంది విద్యార్థులు ఉండగా, ఒక్క ఉపాధ్యాయుడే విధులకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఐదు తరగతులకు పాఠాలెలా బోధిస్తాడని ప్రశ్నించారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు తరలివెళ్లారు.



## మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలి

**నారాయణపేటలో మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్**

నారాయణపేట, జూన్ 24: నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని భోజన కార్మికులు డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి బాల్‌రాం హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో హామీల్లో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల గౌరవ వేతనం అందించాలని కోరారు. వినతి పత్రాన్ని డీటీ నారాయణ, డీఈవో కార్యాలయ అధికారి యాదయ్య శెట్టికి అందజేశారు.



## సీసీఎల్ఏ ఆఫీసు ఎదుట వీఆర్‌ఏల ధర్నా

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): సమస్యలు పరిష్కరించాలంటూ సీసీఎల్‌ఏ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలు సోమవారం ధర్నాకు దిగారు. వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. దూరప్రాంతాలకు బదిలీ చేసినవారిని సొంత జిల్లాలకు పంపాలని కోరారు. ఆప్షన్లు ఇచ్చి రెవెన్యూ శాఖలో కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్, మిషన్ భగీరథ వంటి శాఖల్లోకి బదిలీ అయిన వీఆర్‌ఏలను రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎంఆర్వో సెక్షన్ ఇన్‌చార్జి లచ్చిరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

# జూనియర్ డాక్టర్ల సమ్మెబాట

- రాష్ట్రవ్యాప్తంగా నిలిచిన ఔట్ పేషెంట్, ఇతర సేవలు
- ఫలించని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదరతో చర్చలు
- సమ్మె కొనసాగుతుంది: జూడాలు

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు (జూడాలు) సమ్మెకు దిగారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని గట్టిగా కోరుతున్నారు. ఎమర్జెన్సీ సేవలు మినహా ఓపీ, ఐపీ సేవలకు దూరంగా ఉన్నారు. దీంతో పలు రోగులకు ఇబ్బందులు తప్పలేదు. సోమవారం గాంధీ, ఉస్మానియా, కాకతీయతో పాటు మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులు తమ తమ కాలేజీల ముందు భైఠాయించి నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా జూనియర్ డాక్టర్ల ప్రతినిధులతో మినిస్టర్స్ క్వార్టర్స్‌లో చర్చలు జరిపారు. జూడాలు తమ ఎనిమిది డిమాండ్లను మంత్రి ముందుంచారు. చర్చల అనంతరం జూడా అధ్యక్షుడు డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ.. మంత్రి కొన్ని అంశాలపై సానుకూలంగా స్పందించారని చెప్పారు. స్టైపెండ్ చెల్లింపునకు గ్రీన్‌చానల్‌పై మరోమారు చర్చించి, నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కాకతీయ మెడికల్ కాలేజీలో రోడ్ల నిర్మాణం, హాస్టల్ భవనాల నిర్మాణానికి ఫైల్‌ను ఆర్థిక శాఖకు పంపినట్టు చెప్పారని పేర్కొన్నారు. వైద్యుల భద్రతకు హామీ ఇచ్చారని, కొత్త మెడికల్ కాలేజీలకు బస్ సౌకర్యంపై డీఎంఈతో చర్చించాలని సూచించారని తెలిపారు. అయితే, పూర్తిస్థాయిలో అన్ని డిమాండ్లపై హామీలు రాకపోవడంతో సమ్మెను కొనసాగిస్తామని ప్రకటించారు. అనంతరం జూడా ప్రతినిధులు కోఠిలోని డీఎంఈ కార్యాలయానికి వెళ్లారు. డీఎంఈ వాణితో సమావేశమయ్యారు.




డిమాండ్లు నెరవేర్చాలని గాంధీ దవాఖానలో ధర్నా చేస్తున్న జూనియర్ డాక్టర్లు

**కొన్ని హామీల అమలుకు ప్రభుత్వం సిద్ధం**

జూడాల డిమాండ్లలో కొన్నింటిని నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని డీఎంఈ పేర్కొన్నారు. మిగతావాటిపై స్పష్టత కోసం రెండుమూడు రోజుల సమయం కావాలని కోరారు.

## బీసీలకు 2 లక్షల కోట్లు కేటాయించాలి



కాచిగూడ,జూన్ 24: బీసీల విద్య, ఉద్యోగ, ఆర్థిక, సంక్షేమం, సామాజికాభివృద్ధికి కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలోని లో 13 బీసీ సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు గుడులు కాదని, బడులు కట్టించాలని, దీంతో బీసీలకు సామజిక న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. వికసిత్ భారత్ అంటే అంబానీ, ఆదానీ అభివృద్ధి కాదని, బహుజనులను బాగుచేయడమేనని తెలిపారు. గత కొన్నేండ్లుగా రాష్ట్ర బడ్జెట్‌లో కూడా బీసీలకు అన్యాయం జరుగుతూనే ఉన్నదని, త్వరలో బీసీల సత్తా ఎంటో రుచిచూపిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విజయ డెయిరీలో అరకోటి లూటీ

- లెక్కలు మార్చిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి
- 3 నెలలుగా అధికారుల గోప్యత




ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 24: రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన విజయ డెయిరీలో అక్షరాల అర కోటి రూపాయలు ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అవినీతికి పాల్పడినట్టు తెలుస్తున్నది. ఇది జరిగి మూడు నెలలు గడుస్తున్నా ఉన్నతాధికారులు గోప్యత పాటించడం అనుమానాలకు తావిస్తున్నది. విజయ డెయిరీ తిరుమలగిరి జోనల్ పరిధిలో ఏజెంట్లు, పాల విక్రేతలు, మిల్క్ కార్డుల సొమ్ము సేకరించి, బ్యాంకులో డిపాజిట్ చేసే ఉద్యోగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నాగరాజు పనిచేసేవాడు. డెయిరీలోనే జూనియర్ మేనేజర్‌గా పనిచేసే అతడి తండ్రి సుదర్శన్ సిఫార్సు మేరకు నాగరాజు ఉద్యోగంలో చేరాడు. నాగారాజు సేకరించిన సొమ్మును బ్యాంకు వాళ్లే కార్యాలయానికి వచ్చి తీసుకెళ్లేవారు. ఈ క్రమంలో కొంత మొత్తం మాత్రమే బ్యాంకులో డిపాజిట్ చేస్తూ, కంపెనీ యాప్‌లో తప్పుడు రశీదులు పెడుతూ అధికారులను ఏమార్చేవాడు. మార్చి 13న జమ చేసిన సొమ్ములో తేడా ఉందని, 15వ తేదీ నుంచి నాగరాజు విధులకు రావడంలేదని అధికారులు గుర్తించారు. దీనిపై రీజినల్ సేల్స్ మేనేజర్(ఆర్ఎస్ఎం), జోనల్ ఆఫీస్ ఇన్‌చార్జి ఇద్దరూ కలిసి విచారించి, విక్రేతల నుంచి రావాల్సిన రూ.7,28,760ను సేకరించి, 21వ తేదీన అకౌంట్‌లో జమచేశారు. అనంతరం అకౌంట్స్ విభాగానికి చెందిన అధికారులు నగదు జమకు రశీదులను చూపించాలని కోరగా, 18వ తేదీన ఇదే విషయాన్ని నాగరాజుకు ఆర్ఎస్ఎం తెలిపారు. కేంద్ర కార్యాలయంలోని అకౌంట్స్ విభాగానికి వెళ్లిన నాగరాజు తాను ఏ రోజు వచ్చిన సొమ్ము అదే రోజు బ్యాంకులో జమచేశానని చెప్పినప్పటికీ, రశీదులు సమర్పించలేదు. 23న నాగరాజును కార్యాలయానికి పిలిపించగా, తల్లిదండ్రులతో కలిసి వచ్చిన ఆయన లెక్కల వివరాలను తిరిగి పరిశీలించాలని కోరాడు. ఆపై ఎన్నిసార్లు నాగరాజును సంప్రదించేందుకు ప్రయత్నించినా స్పందించలేదు. మొత్తం లెక్కలు తనిఖీ చేయగా, రూ.53 లక్షలు తేడా రావడంతో జోనల్ ఆఫీస్ ఇన్‌చార్జి తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో ఏప్రిల్ 13న ఫిర్యాదు చేశారు. ఘటన జరిగి మూడు నెలలు గడుస్తున్నా అధికారులు గోప్యత పాటిస్తుండడంపై ఉద్యోగులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. డెయిరీలో సొమ్ము స్వాహా ఉదంతంపై రీజనల్ సేల్స్ మేనేజర్ తబిత, జీఎం మల్లికార్జున్‌లను నమస్తే తెలంగాణ ఫోన్‌లో సంప్రదించగా, అది అడ్మినిస్ట్రేషన్ వ్యవహారమని తాము చెప్పలేమని చేతులు దులుపుకోవడం గమనార్హం.

- **పాల బిల్లులను వెంటనే చెల్లించాలి**



పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే ఖాతాల్లో జమ చేయాలని పాడిరైతులు డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తాండ్ర గేట్ వద్ద తాండ్ర, పోతెపల్లి, జూపల్లి రైతులు, నాయకులు శ్రీశైలం-కల్వకుర్తి ప్రధాన రహదారిపై సోమవారం ధర్నా చేపట్టారు.

# నయవంచక కాంగ్రెస్

**నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం: రాజారాంయాదవ్**

సుల్తాన్‌బజార్,జూన్ 24 : అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఓట్లకోసమే కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన తర్వాత నిరుద్యోగులను నయవంచనకు గురిచేసిందని విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాజారాం యాదవ్ మండిపడ్డారు. విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య ఆధ్వర్యంలో ఓయూ విద్యార్థి, నిరుద్యోగ సంఘాల జేఏసీల నాయకులు నాంపల్లిలోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. రాజారాంయాదవ్ మాట్లాడుతూ ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి గాలికొదిలేసి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే కార్యక్రమంలో బిజీగా ఉన్నారని, నిరుద్యోగులను పట్టించుకునే పరిస్థితిలో ఆయన లేరని దుయ్యబట్టారు. తేదీలతో సహా ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ఏమైందని ప్రశ్నించారు. నిరుద్యోగులను మాయమాటలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి ఆరునెలలైనా ఉద్యోగాల ఊసెత్తడం లేదని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ముట్టడిలో పాల్గొన్న నాయకులను పోలీసులు అరెస్ట్‌చేసి నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# కలెక్టరేట్‌పై ఆత్మహత్యాయత్నం

- భూ సమస్య పరిష్కరించడం లేదంటూ ఆవేదన
- పురుగుల మందు తాగగా దవాఖానకు తరలింపు



జనగామ సమీకృత కలెక్టరేట్ భవనం పైకెక్కి పురుగుల మందు తాగుతున్న పసరుమడ్లకు చెందిన నర్సింగరావు

జనగామ/జనగామ చౌరస్తా, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ఐదేళ్లుగా తన భూసమస్య పరిష్కారం కావడం లేదంటూ జనగామ కలెక్టరేట్ భవనం పైకెక్కి సోమవారం ఓ యువకుడు ఆత్మహత్యా యత్నం చేశాడు. జనగామ మండలం పసరమడ్ల గ్రామంలో సర్వే నంబర్ 159, 160, 231/డీలో నర్సింగరావు తండ్రికి పూర్వీకుల నుంచి వచ్చిన 3.15 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. బతుకుదెరువు కోసం వీరి కుటుంబం 2016లో మేడారం వలస వెళ్లింది. దీంతో దాయాదులు సదరు భూ యజమానులు చనిపోయారని నమ్మించి 2017లో అప్పటి తహసీల్దార్ జే రమేశ్, వీఆర్వో క్రాంతిని సంప్రదించి పాండు, ఎల్లయ్య, ఉపేందర్, శివకుమార్ పేర్లపై అక్రమంగా పట్టా చేసుకున్నారు. విషయం తెలుసుకున్న నర్సింగరావు ఐదేండ్లుగా భూ సమస్యను పరిష్కరించాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. ప్రజావాణిలో పలుమార్లు వినతులు ఇచ్చినా, కలెక్టర్‌ను కలిసినా ఫలితం లేకపోవడంతో గతంలో మూడు సార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. సోమవారం కూడా సమీకృత కలెక్టరేట్ భవనంపైకి ఎక్కి వెంట తెచ్చుకున్న ఫ్లెక్సీని గోడకు కట్టి పురుగుల మందు తాగాడు. సమాచారం అందుకున్న పోలీసులు నర్సింగరావును జిల్లా ప్రధాన దవాఖానకు తరలించారు. కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. కాగా, నర్సింగరావుపై చట్టపరమైన చర్యలు తీసుకునే విషయం పరిశీలిస్తామని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భూమి వివాదం జనగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. అక్కడే పరిష్కరించుకోవాలని గతంలో నర్సింగరావుకు అధికారులు సూచించారని కలెక్టర్ తెలిపారు.



నిర్మల్ విద్యుత్ శాఖ డీఈని నిలదీస్తున్న కొండాపూర్ గ్రామస్తులు

## 'గృహజ్యోతి' కోసం ఆందోళన

- నిర్మల్ కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన గ్రామస్తులు

నిర్మల్, జూన్ 24(నమస్తే తెలంగాణ): అన్ని అర్హతలు ఉండి, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ గృహజ్యోతి పథకం కింద తమకు విద్యుత్తు సబ్సిడీ అందడం లేదంటూ అర్హులందరూ ఆందోళన బాట పట్టారు. నిర్మల్ జిల్లాలోని నిర్మల్ రూరల్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన దాదాపు 150 మందికి పైగా గృహజ్యోతి పథకం అర్హులు కలెక్టర్‌ను కలిసి సోమవారం తమ గోడును వెల్లబోసుకున్నారు. దీంతో స్పందించిన కలెక్టర్.. అక్కడే ఉన్న విద్యుత్‌శాఖ డీఈ నాగరాజును పిలిచి వీరి సమస్యను పరిష్కరించాలని సూచించారు. కాగా, డీఈ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా, ఆయన తీరుపై కూడా గ్రామస్తులు మండిపడ్డారు.

**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on @SCRailwayindia ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

**No.HQ/MD/43/Empanelment of Pvt. Hosp/EOI/24-25 Dt: 22/06/24**

**ఆసక్తి వ్యక్తీకరణ (EOI)**

PUB/0606

సెంట్రల్ హాస్పిటల్, లాలాగూడ యొక్క మెడికల్ డైరెక్టర్ గారు రైల్వే బోర్డు ద్వారా రూపొందించబడిన పాలసీ ప్రకారం, రైల్వే లబ్ధిదారుల చికిత్సార్థం దక్షిణ మధ్య రైల్వేతో ఎంప్యానల్‌మెంట్ కొరకు జంట నగరాలు (సికింద్రాబాద్ మరియు హైదరాబాద్) అధికార పరిధిలోని CGHS/ECHS/ESI ఎంప్యానల్డ్ & నాన్-ఎంప్యానల్డ్ హాస్పిటల్స్ మరియు డయాగ్నోస్టిక్ సెంటర్స్ నుండి ఆసక్తి వ్యక్తీకరణ (EOI) కోరుచున్నారు.

సికింద్రాబాద్ మరియు హైదరాబాద్ అధికార పరిధిలోని CGHS, ECHS, ESI క్రింద ఎంప్యానల్డ్ లేదా నాన్-ఎంప్యానల్డ్ హాస్పిటల్స్ మరియు డయాగ్నోస్టిక్ సెంటర్స్ 15-07-2024న లేదా ఆలోగా దరఖాస్తు చేయాలని కోరడమైనది. దరఖాస్తులను స్వయంగా గాని లేదా పోస్టు ద్వారా గాని సెంట్రల్ హాస్పిటల్, లాలాగూడ, సికింద్రాబాద్-500 017 వద్ద మెడికల్ డైరెక్టర్ గారికి దాఖలు చేయవలెను. దరఖాస్తుదారులు వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో అందుబాటులో ఉంచిన ప్రొఫార్మాను తప్పక పూర్తిచేయాలి మరియు దిగువ తెలిపిన నియమ నిబంధనలు పాటించాలి.

- రేట్లు హాస్పిటల్స్ వర్గీకరణ లేదా హాస్పిటల్ టారిఫ్, ఏది తక్కువైతే దానిపై ఆధారపడి CGHS-2014 హైదరాబాద్ నిర్దేశిత రేట్ల ప్రకారం ఉండాలి. CGHS రేట్ల జాబితా క్రింద కవర్ చేయని ఐటమ్స్ కొరకు, ఫార్మసీ ఐటమ్స్‌పై డిస్కౌంట్ మరియు రైల్వే లబ్ధిదారులు రెండువైపులా రాకపోకల కొరకు ఉచిత అంబులెన్స్ సర్వీస్‌తోపాటు హాస్పిటల్ వారు, వారి సొంత రేట్లపై డిస్కౌంట్ అందించాలి.
- రైల్వే మరియు ఎంప్యానల్డ్ ప్రైవేట్ హాస్పిటల్స్ మధ్య MoU/ఒప్పందంపై సంతకం చేసేటప్పుడు, CGHS ద్వారా రూపొందించిన మరియు రైల్వే ఆవశ్యకతల మేరకు మార్పు చేసిన నమూనాను తప్పక అవలంబించాలి. ఎందుకంటే, ఇది దాదాపు అన్ని విషయాల్లో సమగ్రమైనది మరియు కవర్ చేస్తుంది (అథారిటీ: రైల్వే బోర్డ్ లెటర్ నెం. 2021/H-1/11/10/MoU, తేది: 20-11-2023, వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో లభిస్తుంది).
- ఎంప్యానల్‌మెంట్ చెల్లుబాటు రెండు సంవత్సరాల పాటు ఉంటుంది. తదుపరి ఇరుపార్టీల యొక్క పరస్పర అంగీకారంతో పొడిగించబడవచ్చు.
- తమ యొక్క ఆసక్తి వ్యక్తీకరణ (EOI) దాఖలు చేసినటువంటి హాస్పిటల్స్ మరియు డయాగ్నోస్టిక్ సెంటర్స్, తమ యొక్క సదుపాయాలను మూల్యనిర్ధారణ చేయుటకు మరియు ఎంప్యానల్‌మెంట్ కొరకు సిఫారసులు చేయుటకు రైల్వే వైద్యుల బృందంచే తనిఖీ నిర్వహించబడుతుంది. **ప్రత్యేకంగా CGHS, Non-CGHS, ఫార్మసీ మరియు ఇంప్లాంట్స్‌పై అధిక డిస్కౌంట్‌ను అందించు హాస్పిటల్స్ మరియు డయాగ్నోస్టిక్ సెంటర్స్‌కు ప్రాధాన్యత ఇవ్వబడును.** సమర్థ ప్రాధికారి నిర్ణయమే తుదిగా ఉంటుంది.

A0772 **మెడికల్ డైరెక్టర్, సెంట్రల్ హాస్పిటల్, లాలాగూడ, సికింద్రాబాద్.**